12, 13వ తేదీల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పర్యటన

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి , అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 12న ఉదయం బనగానపల్లె నుంచి బయలుదేరి రాయచోటి చేరుకుంటారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాయచోటిలో జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం (డిడిఆర్‌సి)లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు రాయచోటి నుంచి బయలుదేరి 3 గంటలకు రాజంపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల మధ్య రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సమావేశంలో పాల్గొంటారు. సమావేశం తర్వాత రాత్రి హార్సిలీ హిల్స్‌లో బస చేస్తారు. 13న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు బయలు దేరి 2.30 గంటలకు మదనపల్లె నియోజకవర్గం చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మదనపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో భేటీ కానున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేయాలి
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి ప్రభుత్వాత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంత్రి ఆధ్వర్యంలో ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ నూతన సభ్యుల ఎన్నిక, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు ఎక్కువమంది వస్తుంటారని వైద్యులు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చే వారు చాలావరకు పేదవాళ్లు ఉంటారని, వారిని మానవత్వంతో దగ్గరికి తీసుకుని మెరుగైన చికిత్సలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్లు అందరూ కూడా పేదవారి పట్ల మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రికి ఒక గుర్తింపు తీసుకురావాలన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా అభివృద్ధి చేయాలన్నారు. రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కోట్లతో మంజూరైన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణాన్ని త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు.క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం పూర్తయితే రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు ఇతర అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ప్రమాదాలకు గురైన వారు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారని క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం పూర్తి అయితే ఇక నుంచి ఈ ప్రాంత ప్రజలకు అటువంటి సమస్యలు ఉండమన్నారు. త్వరలో రూ.20 లక్షల సిఎస్ఆర్ నిధులతో ఆసుపత్రిలో ఆర్ఒప్లాంట్, ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించి రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని చెప్పారు.ఆసుపత్రికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న ఎలక్ట్రికల్ పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇకనుంచి ఆసుపత్రికి ఎటువంటి నీటి సమస్య తలెత్తకుండా రోజూ మున్సిపాలిటీ వాటర్ వచ్చే విధంగా చర్యలు చేపడుతారని చెప్పారు. కార్యక్రమంలో ఆడిఒ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ కుమార్, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, వైద్యులు, ఆసుపత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభించిన మంత్రి

చిన్నమండెం : మండలం, వండాడిగ్రామం, గొర్లముదివీడు క్రాస్ నుండి తూర్పుపల్లి వరకు రూ.కోటితో నిర్మించిన నూతన తారు రోడ్డును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలకు రూ.450 కోట్ల రూపాయల ఖర్చు చేసి వెలుగులు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసి శాశ్వత మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని తెలియజేశారు. ఇప్పటికే అవసరమైన గ్రామాలలో బోర్లు వేసి తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. 15 సంవత్సరాలుగా వైసిపికి చెందిన వారు ఎమ్మెల్యేగా ఉండి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కేవలం తొమ్మిది నెలల కాలంలోనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని వంద నుంచి 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. త్వరలో రూ.350 కోట్లతో హంద్రీనీవా కాలువల ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడ కూడా సిమెంట్ రోడ్లు నిర్మించలేదని దీంతో ప్రజలు నడవడానికి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుమూల గ్రామాలకు సైతం సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల క్షేమానికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ముమ్మరం

- టిటిడి ఇఒ జె.శ్యామలరావు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిటిడి ఇఒ, కడప జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు కడప జిల్లా యంత్రాంగం, టిటిడి సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు వెల్లడించారు. మంగళవారం కల్యాణ వేదిక ప్రాంగణాన్ని జిల్లా అధికారులు, టిటిడి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని పరిపాలన భవనం సమావేశ మందిరంలో ఇఒ, కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్, టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మంతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మీడియాతో మాట్లాడుతూ శ్రీసీతారాముల కల్యాణానికి టిటిడి చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేలా ఈ ఏడాది భక్తుల సౌలభ్యం కొరకు అత్యాధునిక టెక్నాలజీతో 21 ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. టిటిడి విజిలెన్స్ విభాగం నుండి 350 మంది, జిల్లా పోలీస్ యంత్రాంగం నుండి 2500 మంది భద్రతా సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్‌టిసి ద్వారా కడప నుండి ఒంటిమిట్ట వరకు 85 బస్సులతో 425 ట్రిప్పులు, రాజంపేట నుండి ఒంటిమిట్ట వరకు 40 బస్సులతో మొత్తం 625 ట్రిప్పుల ద్వారా భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా శ్రీసీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్క్‌లు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర విభాగాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. కడప జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ టిటిడి విజిలెన్స్ సిబ్బంది, జిల్లా పోలీసు యంత్రాంగం కలిసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాలలో సిసి కెమరాలు, కంట్రోల్ రూం ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సమావేశంలో సిఎం ప్రోగ్రాం సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, టిటిడి డిప్యూటీ ఇఒ నటేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిపిఒ రాజ్యలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ రమణయ్య, పలువురు జిల్లా అధికారులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి ఏడు గంటలకు శ్రీ సీతారామలక్ష్మణులు సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వాహనసేవలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికులతో సంతకాలు సేకరిస్తున్న మున్సిపల్ కార్మికులు

సంతకాల సేకరణలో మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి లక్ష్మీదేవి, కార్మికులు బాలాజీ, సాలమ్మ, ప్రమీల, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల భద్రతకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు: ప్రభుత్వం అందించనున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా సామగ్రి కిట్లు భద్రపరచడానికి అవసరమైన స్థల పరిశీలన చేసినట్లు రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ పెంచలయ్య తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న విద్యా సామగ్రి భద్రపరచుటకు అనువైన స్థల పరిశీలన మంగళవారం పీలేరులో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ విద్యా సామగ్రి నిల్వ చేయడానికి అధికారులు తగు ఏర్పాట్లు చేసుకుని, వాటికి ఎలాంటి నష్టం జరగకుండా భద్రపరచుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో విద్యా సామగ్రి వరుసగా సరఫరా చేస్తారని, విద్యా సామగ్రి వచ్చిన వెంటనే వాటిని పాఠశాలలవారీగా కమిటీ సభ్యుల ద్వారా క్రమబద్ధీకరించి, పాఠశాలల పునఃప్రారంభ సమయానికి అవి అన్ని పాఠశాలలకు చేరి, విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేయడానికి వీలుగా తగిన కార్యచరణను రూపొందించుకోవాలని ఆదేశించారు. విద్యా సామగ్రిని భద్రపరచడానికి తగిన ఏర్పాట్లను మండల విద్యా కమిటీ ద్వారా చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త యు.వెంకట్రామయ్య, ఎంఇఒ వై.లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, కమిటీ సభ్యులు, సిఆర్‌పిలు జలకనూరి మురళీధర్ రాజు, మాధవి, అశోక్, నాగరాజ, కార్యాలయ సిబ్బంది తాజూన్, శిరీష, భవిత ఉపాధ్యాయులు ధరణీజ, సుబ్రహ్మణ్యం, సంబంధిత సహాయ ఇంజనీర్ రమేష్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వక్ఫ్‌సవరణ బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఇండియా కూటమి పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విసికె పార్టీ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టం-దుష్పరిణామాలు అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విసికె రాష్ట్ర ప్రచార కార్యదర్శి టి.ఎ.పీర్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డి సాహెబ్, సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, సిపిఐ నాయకులు తోపు కృష్ణప్ప, కోటూరి మురళి, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కోనేటి దివాకర్, న్యాయవాదులు సోమశేఖర్, సుహేల్, ముస్లిం ఐక్య వేదిక అధ్యక్షుడు ఫైజ్ అహ్మద్ ప్రసంగించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజం యొక్క మత స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే విధంగా రూపొందిం చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇతర మత సమాజాల ఆస్తుల విషయంలో జోక్యం చేసుకోనప్పుడు, వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో మాత్రం ఎందుకు ఈ దూకుడు చూపిస్తోందని ప్రశ్నించారు. బిల్లు వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహిస్తామని తెలిపారు.

10న విద్యుత్ అదాలత్ : ఇఇ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రాజంపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం నిర్వహించే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇఇ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యుత్ అదాలత్‌లో చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్ రావు సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్.అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి, నందలూరు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమం ఉదయం ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కమనీయం... శ్రీసీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాల్మీకిక్షేత్రం శ్రీ పట్టాభిరామస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు ఆశ్లేష నక్షత్రంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాధారణంగా అన్ని రామక్షేత్రాలలో శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. దేశంలో ఇందుకు భిన్నంగా వాల్మీకిపురంలో సీతమ్మవారు జన్మదినమైన ఆశ్లేష నక్షత్రంలో సీతారాముల కల్యాణం నిర్వహించడం ఇక్కడి విశేషం. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, అర్చన, కొలువు, బలి, శాత్తుమొర, ఉదయం తిరుచ్చిలో స్వామివార్లకు అలంకరణ, అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. 10 గంటల నుంచి స్నపన తిరుమంజనంకు విచ్చేసిన భక్తులు స్నపన తిరుమంజనం తిలకించి తన్మయత్వం చెందారు. సాయంత్రం ఊంజల మండపంలో స్వామివారికి ఊంజల్ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన వధూవరులైన సీతారాములకు పట్టుపీతాంబరాలు, విశేషాభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణ పరిధి తోటవీధిలోని టిటిడి స్థలంలో ఆరుబయట ఏర్పాటు చేసిన అతిసుందరంగా అలంకరించిన మైథిలి కల్యాణ వేదికపై వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఆర్జిత కల్యాణోత్సవ దంపతులు ఆశీనులై తిలకిస్తుండగా సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. సీతారాములు ముత్యపు తలంబ్రాలతో తడిసి ముద్దయ్యారు. సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రులవారిని అలంకరించి ఆస్థానం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కల్యాణోత్సవానికి వేలాది మంది భక్తులు రావడంతో తోటవీధి కిక్కిరిసింది. ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు నూతన వస్త్రం, ప్రసాదాలను అందజేశారు. రాత్రి 11గంటలకు తనప్రియమైన గరుడ వాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి తిరుమాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి-వీరబల్లి

ఉద్యాన పంటలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మండలంలోని సంగంవారిపల్లి, మట్లిలో నూతనంగా నిర్మించి ఏర్పాటు చేసిన పశువుల నీటి తొట్లు, ఉద్యాన పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. మామిడి చెట్ల పెంపకం, యాజమాన్య పద్ధతులు, నీటి వసతి, మామిడికాయల పంట దిగుబడి, చీడపీడల నివారణ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలలో రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి గ్రామాలలో నీటి తొట్లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ కూడా నీరు కోసం పశువులు ఇబ్బందులు పడరాదని అధికారులకు సూచించారు. నీటి సంరక్షణ చర్యలు చేపట్టి భూగర్భ జలాల వృద్ధికి కూడా ప్రభుత్వం విశేష కృషి చేస్తోంన్నారు. గ్రామాలలో సేద్యపు నీటి కుంట ఫారం పాండ్లను కూడా విస్తృతంగా మంజూరు చేస్తున్నామన్నారు. ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో 27 నేటి తొట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క తొట్టి విలువ రూ.32 వేలని తెలిపారు. 3,300 లీటర్ల నీరు పడుతుందన్నారు. అనంతరం మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీ మాదిరెడ్డిగారిపల్లిలో మామిడి పొలాన్ని పరిశీలించి రైతులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు, తహశీల్దార్ వెంకటేష్, మండల హార్టికల్చర్ ఆఫీసర్ వనిత, ఎస్ఐ మోహన్ నాయక్, విఆర్‌ఒలు నరసింహులు, ప్రేమసాగర్, ఉపాధి ఇసి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మామిడి కాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

తాగునీటి సమస్య నివారణకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి-పీలేరు

ఈ వేసవిలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని పీలేరు ఎంపిపి కంభం సతీష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి పథకాల స్థితిగతులపై దృష్టి సారించాలన్నారు. మండలంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులకు ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. విధినిర్వహణలో భేదభావాలు లేకుండా అందరిని సమానంగా చూడాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని సూచించారు. ఎంపిటిసి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పీలేరు, కలికిరి మధ్య జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో పల్లెలకు తగిన దారులు లేవని, చెరువులకు నీరు అందించే కాలువలు కూడా వాటి రూపురేఖలు కోల్పోయాయని, రానున్న వర్షాకాలంలోగా వాటిని పునర్నిర్మించి అటు ప్రజలకు ప్రజలకు, ఇటు రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎంపిటిసి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రీ సర్వే ఫలితంగా చాలా మందికి సంబంధించిన భూముల సర్వే నెంబర్లు తారుమారయ్యాయని, భూ విస్తీర్ణంలోనూ లెక్కలు మారి భూములు ఎక్కువ, తక్కువగా నమోదయ్యాయని, వాటిని సరిచేసి సమస్య లేకుండా చూడాలని విజ్ఞప్తి చేసుకున్నారు. దానిపై తహశీల్దారు భీమేశ్వరరావు స్పందించి మాట్లాడుతూ అలాంటి పొరపాట్లు జరిగి ఉండడం వాస్తవమేనని, సచివాలయాల్లో పనిచేసే సర్వేయర్లకు తగిన అనుభవం లేని కారణంగా కొన్ని తప్పులు జరిగాయని, వాటిని తప్పకుండా సరి చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామ సభలు తప్పకుండా గ్రామ ప్రధాన కేంద్రంలోనే జరపాలని, కొందరు మాత్రం తమ ఇష్టానుసారం సమావేశాలు నిర్వహించడంపై ఎంపిపి మండిపడ్డారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షామియానా షఫీ మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. పారిశుధ్య కార్మికులకు గతంలో ఇస్తున్న వేతనాలకన్నా ప్రస్తుతం తక్కువగా ఇస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. ఈ విషయంలో ఇఒపిఆర్‌డి లతీఫ్ ఖాన్‌ను దృష్టి పెట్టి అన్ని విధాలా అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. ఆదివారం జిల్లాలోని దేవపట్ల సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమ మృతికి సమావేశంలో అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సమావేశంలో ఎంపిడిఒ శివశంకర్, తహశీల్దారు భీమేశ్వర రావు, మండల వైస్ ప్రెసిడెంట్ హరిత, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ బాష, ఎంపిటిసిలు నరసింహారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఇరిగేషన్ డిఇ సేవలా నాయక్, ఎఇలు ఇరగన్న, రామాకృష్ణ నాయక్, ఐసిడిఎస్ పర్యవేక్షకులు స్వరూప, స్వర్ణ పాల్గొన్నారు.

నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సురక్షిత ప్రయాణమే ఆర్‌టిసి లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ యొక్క ముఖ్య ఉద్దేశమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శివాలయం సెంటర్‌లో 12 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభి స్తామని తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 3, సూపర్ డీలక్స్‌లు, 2, అల్ట్రా డీలక్స్‌లు, 5, ఎక్స్‌ప్రెస్‌లు, 2, పల్లె వెలుగు బస్సులను ప్రారంభించామన్నారు. గత ఐదేళ్లలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. రాబోయే రోజులలో ఆర్టీసీని పూర్తి ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన రవాణా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో మరో 300 ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభించామన్నారు. ప్రజల సంక్షేమం కోరే మంచి ప్రభుత్వానికి మీ అందరి ఆశీస్సులు దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్టీసీ డిపో మేనేజర్ ధనుంజయ, రీజనల్ మేనేజర్ రాము, మదనపల్లె, పీలేరు, రాజంపేట డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

అనధికార ఇళ్లను క్రమబద్ధీకరణ చేస్తాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా నిర్మించుకున్న ఇళ్లను క్రమ బద్ధీకరించుకునే సదవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మిం చుకుని ఉంటే జిఒ 30 ప్రకారం ఆ ఇంటిని ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమ బద్ధీకరించు కోవాలని తెలిపారు. బిపిఎల్ కేటగిరికి చెందిన పట్టణ, రూరల్ పరిధిలో ఇప్పటికే కుంట స్థలంలో 2019, అక్టోబర్ 15కు ముందు పక్కా ఇళ్లునిర్మిం చుకొని ఉంటే, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్నారు. అభ్యంతరాలు లేని ఇళ్లనే క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేశారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం : డిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రం, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించేది కేవలం కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే అని అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాజుల భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకులు ధరలు అధికమయ్యాయి అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. **నూతన జిల్లా కమిటీ ఏర్పాటు :** జిల్లా నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బండపల్లి గిరిబాబు, దర్బార్‌బాష, ఖాదర్ బాషా, రాయచోటి చెన్న కృష్ణ, జనరల్ సెక్రెటరీగా ఖాదర్‌ఖాన్, రమణమ్మ, మస్తాన్‌వలి, మహమ్మద్ అలీఖాన్, ప్రతినిధిగా మన్సూర్ అలీఖాన్, డాక్టర్ సయ్యద్ అహ్మద్, సెక్రటరీగా రియాజ్, లీగల్ సెల్ చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా నరేష్, మహిళా అధ్యక్షులుగా సుల్తాన్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఆనంద్, ఒబిసి చైర్మన్‌గా ఆది నారాయణ, ఒబిసి వైస్ చైర్మన్‌గా కొండన్నను నియమించినట్లు డిసిసి అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సింగం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీతో డిసిసి అధ్యక్షులు భాస్కర్

విద్యార్థిమిత్ర స్టాక్ పాయింట్ కిట్ గదులను పరిశీలిస్తున్న పెంచలయ్య

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ సందర్శన

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ మోడల్ స్కూల్లో ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ ను స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ కె.పెంచలయ్య సందర్శించినట్లు ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థి మిత్ర కిట్లు నిల్వ ఉంచే వాటిని నిల్వ గదులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. జూన్ 12 నాటికి ప్రతి విద్యార్థికి కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. కిట్ సరఫరా బాధ్యత మండలంలోని ఎంఇఒ లు తీసు కోవాలని సూచించారని చెప్పారు. రూట్ మ్యాప్‌లు తయారు చేసుకుని ఒక్కొక్క రూట్‌కు ఇన్‌ఛార్జి నియమించి ప్రతి పాఠశాలకు కిట్లు అందేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ, కో-ఆర్డినేటర్ వెంకట రమయ్య, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ మంగగోపాల్, డిటిఇఒ మల్లికార్జున, సిఆర్‌పి శ్రీకాంత్, ఎంఐఎస్ అరుణ్‌కుమార్ తెలిపారు.

నేడు డిటికి సన్మానం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని దేవగుడిపల్లి గ్రామానికి చెందిన మండిపల్లి వెంకటశివ తిమ్మారెడ్డి లక్కిరెడ్డిపల్లి మండలం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని రాయచోటి పట్టణంలోని సుధా కన్వెన్షన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సహచర ఉద్యోగులు, బంధుమిత్రులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె సివిల్ సప్లై డిటీగా పనిచేసిన ఈయన సుమారు 22 సంవత్సరముల కిందట రెవెన్యూ వ్యవస్థలోకి అడుగు పెట్టారని అన్నారు. వీఆర్‌ఒ స్థాయి నుంచి డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన ఈయన పలు మండలాల్లో తన విధులను బాధ్యతగా నిర్వహించి అశేష ప్రజల మన్ననలు పొందారని అన్నారు.

'ఆకేపాటి'ని కలిసిన రెడ్డెయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి రాజంపేట మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా ఏసూరి రెడ్డయ్యను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా మంగళవారం రెడ్డయ్య రాజంపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో పదవి ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తానన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భాస్కర్‌రాజు, ఎంపిటిసి మధుబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

పిటిఎం విద్యుత్ ఎఇగా గిరిధర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్త మండలం ఎఇగా విధులు నిర్వహిస్తున్న గిరిధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పెద్దతిప్పసముద్రం మండల రైతులు ఎఇ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇన్‌ఛార్జి ఎఇగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఉన్నతాధికారి సుధీర్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడంతో పిటిఎంకు బి.కొత్తకోట సమీపంగా ఉండటంతో అదనపు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వహించి రైతులకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ మొరంపల్లి సహదేవ, హెచ్ఎం రజని పేర్కొన్నారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో గల బ్రిలియంట్ రజతోత్సవ వేడుకలు మంగళవారం రింగ్ రోడ్డులోని శ్రీదాశేశ్వరి కల్యాణ మండపంలో అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో చదవాలన్నారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం చెప్పిన విధంగా కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అనే పదాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదం డ్రులను, విద్య నేర్పిన ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను చక్కగా అవగాహన చేసుకోవడంతో పాటు, సామాజిక స్పృహ, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలని, సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన నృత్యం విద్యార్థుల్లో సంతోష ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులను విస్మరిస్తే చర్యలు

ప్రజాశక్తి-పుల్లంపేట

తమ విధి నిర్వహణలో విధులను విస్మరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సాం ఘిక సంక్షేమ అధికారి జయప్రకాష్ హెచ్చరించారు. ఆయన మంగళవారం పుల్లంపేట మండలం లోని ఎస్‌సి హాస్టల్‌లో రైల్వే కోడూరు నియోజక వర్గంలోని అన్ని హాస్టళ్ల వార్డెన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో విధు లను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారమే ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబం ధనలు అధిగమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జట్టుకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మదనపల్లెలో నిర్వహించిన జిల్లా షూటింగ్ బాల్ జట్టుకు మండలంలోని ఎపి మోడల్ స్కూల్, తంబళ్లపల్లి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ పి.లత తెలిపారు. ఆదివారం మదనపల్లె ప్రైమ్ స్పోర్ట్స్ అరీనాలో నిర్వహించిన పోటీలో ఏ.పి.మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా బాలుర విభాగంలో ఇద్దరు అఖ్యాన్రృహమ్, గౌస్బాషమ్మద్ ఎంపిక అయ్యారని తెలిపారు. బాలికల విభాగంలో కరీమున్నీసా ఎంపికయ్యారు. బాలుర విభాగంలో స్టాండ్‌బై ప్లేయర్ హర్షవర్ధన్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 26,27వ తేదీలలో మదనపల్లెలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంఇఒ-1 త్యాగరాజు, ఎంఇఒ-2 నాగ సుబ్బారాయుడు, పాఠశాల ప్రధానాచార్యులు ఎస్.హేమంత్‌కుమార్, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్ అభినందించారు.

జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పీడీ

విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సుండుపల్లె

విష జ్వరాలు ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఫర్హానామ్ పేర్కొన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, శ్రీనివాసులు రెడ్డి మండల కేంద్రం సుండుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీ లించారు. అనంతరం ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. మురుగు గుంతలు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట అబెట్ ద్రావణాన్ని ఆశాలచే పిచకారి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, ఫైలేరియా , చికన్ గున్యా, మెదడువాపు జ్వరాలు రాకుండా ఫ్రైడే, డ్రైడే సర్వే, వేక్టార్ కంట్రోల్ యాప్‌ల ద్వారా మురికి నీటి కాలువలు, మురికి గుంటలలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఉండు టకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్తికేయనగర్‌లో మురికి గుంతలు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్తికేయనగర్‌లో మురుగు గుంతలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

మల్లయ్యకొండ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



వైసిపి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని మల్లయ్య కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభి షేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యేకి స్వామివారి దర్శనం కల్పించి సాంప్రదా యబద్ధంగా తీర్థప్రసాదాలను అందించారు. కొండపైన చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే నాయకులతో చర్చించారు. అనంతరం గోపిదిన్నె పంచాయతీ బోరెడ్డి వారి కోటలో వైసిపి నాయకులు రమణారెడ్డి తల్లి చిన్నక్కమ్మ మృతి చెందడంతో ఆ గ్రామానికి వెళ్లి రమ ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎం పిపి కరీం, ఎంపిటిసి సభ్యులు మహేష్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మెడికల్ షాప్ నారాయణరెడ్డి, రామ్మూర్తి, శివారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని పిటిఎం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. మండలం శ్రీ కళ్ళు ఎంపిటిసి వెంకట్రమణమ్మ భర్త ఉత్తన్నలు షిరిడి కిరీటం శాలువాలతో ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో రమణారెడ్డి, శంకర్, లక్ష్మి నారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అరుంధతి, సర్తాజ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషక పక్షోత్సవాలపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు, ఆరు నెలలు మూడు సంవ త్సరాల లోపు పిల్లల తల్లులకు, ప్రజలకు గృహ సందర్శనాలు, ర్యాలీ సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. గర్భదశ నుంచి రెండు సంవత్సరాల వరకు బిడ్డను సంరక్షించుట, లబ్ధి దారులు స్వయంగా తమంతట తామే పోషక పోర్టల్‌లో నమోదు చేసుకోనే విధంగా ప్రచారం చేయడం వివరించినట్లు తెలిపారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ, సిఎంఎఎం అమలు చేయడం ద్వారా పిల్లల్లో పోషక ఆహార లోపం నివారించడం, ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవ నశైలి అలవాటు చేసుకొనేలా చేయడం వంటి నాలుగు కార్యక్రమాలపై ఐసిడిఎస్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు అవకాశం

ప్రజాశక్తి-కలకడ

గతంలో అమలులో ఉన్న 225వ జిఒను రద్దు చేస్తూ, ప్రభుత్వం తాజాగా 30వ జిఒను అమలు చేయడంతో పేదలకు న్యాయం జరుగుతుందని తహశీల్దార్ ఫణి కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహశీల్దార్ ఇచ్చిన సమాచారం ప్రకారం, 30జిఒ అమలుతో 2019 సంవత్సరానికి ముందు మౌలిక సదుపాయాల వరకు ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు వారి వద్ద ఇంటి పర్మిట్, విద్యుత్ బిల్లు, పంచాయతీ రికార్డులు వంటివి ఉంటే వారు తమ స్థలాలను ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం పొందుతారని అన్నారు. ఇందుకోసం లబ్ధిదారులు ప్రభుత్వానికి మార్కెట్ విలువ ఆధారంగా చలానా ఉంటుందని చెప్పారు. ఈ నూతన జీవో ద్వారా గతంలో 225జిఒ కింద అమలవుతున్న పాత పథకాలన్నీ రద్దు చేయబడతాయని అన్నారు. ఇప్పుడు 30.ఇఒ ప్రకారం ఏ పేదవారు అయినా తమ స్థలంపై ఇంటిని నిర్మించి, అవసరమైన ఆధారాలతో నమోదు చేసుకుంటే ప్రభుత్వం వారిని చట్టబద్ధంగా గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి మంజూరు చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఆధారాలను సక్రమంగా సమర్పించి అవకాశం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

రామాపురం : పేదవానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో సొంత స్థలంలో ఇల్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న వారికి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆ స్థలానికి డి-ఫారం ఇవ్వడానికి ప్రభుత్వం జిఒ ఇచ్చినట్టు పేర్కొన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పక్క గృహం పొందకుండా ఎవరికి అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలంలో 2019 అక్టోబర్15 మునుపు సొంతంగా రేకుల షెడ్డుగానీ, ఇల్లుగాని నిర్మించుకున్న వారికి స్థలాన్ని స్వాధీనంలో ఉంచుకున్న వారికి అదే స్థలానికి మహిళల పేరు మీద డిఫారం ఇచ్చి స్థలాన్ని స్వాధీనం చేస్తారన్నారు. బిపిఎల్ కింద ఉన్నవారు గ్రామీణ ప్రాంతాలలో నెలకు రూ.లక్ష ఆదాయం కలిగిన వారు అర్హులన్నారు. 2019 అక్టోబర్ 15 నాటికి ఇల్లు నిర్మించుకున్నవారు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులుః, రేషన్ కార్డు, లబ్ధిదారురాల మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఇంటి ఫోటో దరఖాస్తుతో కలిపి సచివాలయంలో విఆర్‌ఒకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

శానిటరీ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ముఖ్య కేంద్రంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్ మైండ్స్ 12వ వార్షికోత్సవంలో భాగంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కలికిరిలో శానిటరీ ప్యాడ్ బ్యాంక్ ఆవిష్కరించారు. రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు తెలియాజేస్తూ హెల్పింగ్ మైండ్స్ బృందం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంజలీదేవి మాట్లాడుతూ విద్యార్థినుల కోసం శానిటరీ ప్యాడ్ బ్యాంక్ అందుబాటులోకి తెచ్చిన హెల్పింగ్ మైండ్స్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్, ఆర్షియా దంపతులను దుశ్శాలువ, మెమెంటోతో సన్మానించారు. ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ గులాబ్ జాన్ మాట్లాడుతూ చిన్న వయసులోనే సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న హెల్పింగ్ మైండ్స్ సేవలు ఆదర్శమని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.మాధవి, స్వర్ణలత, రామకృష్ణ, ఉదయ, లిఖిత, జి.మాధవి, హజీరా, శైలజ, కీర్తి, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సునీల్, కిరణ్, చైతు, సాంబ చరణ్ పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ అంజలీదేవి

ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

నోటి శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆశ వర్కర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఆశా వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యనిపుణులు డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ నోటి పరిశుభ్రతను పాటించాలని,ఆరోగ్యకరమైన జీవనశైలిని అల వరచుకోవాలని సూచించారు. మంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి నోరు కూడా ఒక సాధనమని, చక్కగా మాట్లాడడం,హాయిగా నవ్వడం, రుచి చూడటం,సరైన పోషకాహారాన్ని జీర్ణించు కోవడంపై నోటి ఆరోగ్యం ప్రభావం చూపుతుందని వివరించారు. మంచి బ్రష్‌తో పళ్ళు తోమడానికి ఎంపిక చేసుకోవాలని, మూడు నుంచి ఐదు నిముషాలలోపు పళ్లను తోమడం ముగించాలని, త్వర త్వరగా బ్రష్ చేయకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శంకర్,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పల్లెలు : 'అరవ'

ప్రజాశక్తి-చిట్వేలి

కూటమి ప్రభుత్వంలో ప్రతి పల్లె ప్రగతిపథంలో పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి పాల్గొన్నారు. నాగవరం పంచాయతీలోని వడ్డిపల్లి, దేవుని నాగవరం, ఉప్పరపల్లి, చొప్పావారిపల్లిగ్రామాల్లో సిసి రోడ్లను ప్రారంభించారు. నేతివారిపల్లి గ్రామ సచివాలయం ప్రారంభించారు. మార్గోపల్లిగ్రామ పంచాయతీ కేంద్రంలో నిర్మించిన ఆరోగ్యకేంద్రం, రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు బాలు రామాంజనేయులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, గుత్తి నరసింహ, గుండాల యాదవ్, మాదాసు నరసింహ, రవికుమార్ రాజు పెంచల్ రెడ్డి, రాజా నాగేశ్వరరావు, కూటమి నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌డిసి రమ మృతి తీరనిలోటు

- సంతాపసభలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

విధుల పట్ల ఎంతో నిబద్ధత కలిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమను కోల్పోవడం జిల్లాకు తీరని లోటని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమ మరణం పట్ల సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రమ ఎంతో నిబద్ధతగా విధులు నిర్వహించే వారిని అటువంటి మంచి డిప్యూటీ కలెక్టర్‌ను కోల్పోవడం మన దురదృష్టం అని పేర్కొన్నారు. సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మొదటిసారిగా రమ పనిలో చూపించే నిబద్ధత గురించి చెప్పాడని ఆయన సిఫారసు ద్వారానే పిజిఆర్ఎస్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా ఆమెను నియమించినట్లుగా పేర్కొన్నారు. ఆమె నియామకం తర్వాత పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంలో జిల్లా ఎంతో వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. 2005లో ఆమె రెవెన్యూ శాఖలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి రిమార్క్ లేకుండా విధులను నిర్వహించడం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఎస్‌ఇ ఆర్‌అండ్‌బి సహదేవరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిఎఒ చంద్ర నాయక్ తదితరులు ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న ఉభయ దారులు

వైభవం..సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా పురోహితులు దేవెళ్ల మల్లికార్జున స్వామి సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. కల్యాణ ఉభయదారులుగా గాడి సుబ్రహ్మణ్యంరెడ్డి, భారతి దంపతులు వ్యవహరించారు. భక్తుల రామనామ స్మరణల నడుమ కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-రామాపురం

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు టిడిపి నాయకులు దిలీప్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కల్పనాయుని చెరువు గ్రామంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉందని అన్నారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పనులకు పశువులు, మేకలు, గొర్రెలు మేపుకోవడానికి వెళ్లి వస్తుంటారని అన్నారు. వారికి దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామప్రజలు, దిలీప్ సన్నిహితులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల విలువైన ఆభరణాలు బహూకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని కొండక్రింద కురవపల్లి రామాలయంలో విగ్రహాలకు అలంకరించేందుకు రూ.2.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను బండారువారిపల్లి సర్పం చ్, వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు సాంబశివ బహూ కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి, నిర్మాణానికి సహాయ, సహకా రాలు అందిస్తున్నారని అన్నారు. ఆయన స్ఫూర్తితో తాను రామాలయంలో విగ్ర హాల అలంకరణకు బంగారు ఆభరణాలు తయారు చేయించి ఇవ్వడం జరిగిందన్నారు. స్వామివారికి ఆభరణాలు చేయించి ఇవ్వడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆభరణాలను అందజేస్తున్న దాతలు

క్రైం కార్నర్

బీరువాలో చెల్లాచెదురుగా పడిఉన్న వస్తువులు

ప్రశాంత్ నగర్‌లో చోరీ

- నగలు, నగదు అపహరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ప్రశాంత్‌నగర్‌లో దొంగలు పడ్డారు. తాళం వేసున్న ఇంట్లోకి చొరబడి బీరువాను తెరచి నగలు, నగదు అపహరించుకుని పోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు మంగ ళవారం కేసు నమోదు చేశారు. సిఐ రామచంద్ర కథనం మేరకు.. పట్టణంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన గన్నెఎర్రిస్వామి రెండురోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకుని బంధువుల ఊరికి వెళ్ళారు. రాత్రి తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 80గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమతి లేకుండా చింత చెట్లను నరికేసిన ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. సిఐ కథనం మేరకు.. మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లి పంచాయతీలోని కంబాల జగదీశ్వరికి చెందిన పట్టా భూమిలోని చింత చెట్లను మాదిన భాస్కర్, శాంతమ్మ, మరో ముగ్గురు కలిసి అక్రమంగా నరికి వేశారు. జగదీశ్వరమ్మకు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం కలిగింది. బాదితురాలి ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం ఆ ఐదుమందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

అత్తపై అల్లుడు దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అత్తపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి తంబళ్లపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు..మండలంలోని కె.దయాలోల్లపల్లికి చెందిన రెడ్డమ్మ తన కూతురును బి.కొత్తకోటకు చెందిన మల్లికార్జునరెడ్డికి ఇచ్చి వివాహం జరిపించింది. భార్య భర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడడంతో మల్లికార్జునరెడ్డి భార్య అలిగి రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను కాపురానికి తీసుకెళ్లేందుకు మల్లికార్జునరెడ్డి రాత్రి దయ్యాలవారిపల్లెకు వెళ్లాడు. కుమార్తెను కాపురానికి పంపేందుకు అత్త రెడ్డెమ్మ నిరాకరించడమతో ఆవేశానికి గురైన అల్లుడు మల్లికార్జునరెడ్డి అత్తపై బండరాయితో దాడిచేసి తీవ్రంగా కొట్టాడు. స్థానికులు అడ్డుకుని తీవ్రంగా గాయపడిన బాధితురాలిని మదనపల్లె ప్రభు త్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని భవన కార్మికుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

ద్విచక్ర వాహనం ఢీకొని భవన కార్మికుడు తీవ్రంగా గాయపడినట్లు అస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు. మంగళవారం వెలుగు చూసిన ఘటనపై వివరాలు.. బి కొత్తకోట ఎగువ శీతివారిపల్లెకు చెందిన రమేష్ భవన నిర్మాణం పనులు చేయడానికి బురకాయల కొట్టుకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బైకులో వస్తుండగా, మార్గ మాధ్యంలోని బురకాయలకోట సమీపంలో బురకాయలకొటకు చెందిన కోటేశ్వర్‌రెడ్డి బైక్‌పై వేగంగా వచ్చి రమేష్ బైక్‌ను ఢీ కొట్టాడని తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాదితుడు రమేష్‌ను స్థానికులు వెంటనే మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్యసిగిచ్చులు అందించడంతో ప్రాణా పా యం తప్పిందన్నారు. ఈ ఘటనపై ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.